కథానిక

# ఓ శవం కథ

ఆ రోజు జనవరి ఒకటవ తేది. కొత్త సంవత్సరము కావడంచేత దేశం నలుమూలల నుండి ఏడుకొండల వాడి దర్శనం చేసుకోవాలని, తండోప తండాలుగా ప్రజలు వస్తున్నారు. తిరుపతి తూర్పు రైల్వే స్టేషన్ మనుష్యులతో కిక్కిరిసి చాలా రద్దీగా వుంది. స్టేషన్‌కి పడమటి దిక్కుగా కొంచెం దూరంలో పోలీసు స్టేషన్ ఉంది. దానికి కొంచెం ఉత్తరాన గోవింద రాజుల స్వామి ఆలయముంది. ఈ రోడ్లు కలిసే కూడలికి ఒక ప్రక్కన ప్రాణం లేని మనిషి కళేబరం పడివుంది. ముతకి గుడ్డ ఒకటి శవం మీద పడి ఉంది. ఆ దారిలో నడిచేవారినెవరినీ ఆశవం ఆకర్శించడం లేదు. కొంతమంది యాత్రికులు శవాన్ని చూసినా చూడనట్టు పోతున్నారు. మరి కొందరు సహాయం చేయ లేక పోయినా సానుభూతిగా శవం వంక చూసి వెళ్ళి పోతున్నారు. కూడలి మధ్య ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా రోడ్డు ప్రక్కన పడి ఉన్న శవాన్ని చూసి చూడనట్టుగా తన డ్యూటీ తాను చేస్తున్నాడు. ఇంతలో ఒక నడి వయస్సు వ్యక్తి దైవ దర్శనానికి వెళ్తూ, శవాన్ని చూచి స్తంభించి పోయాడు. అది చూసిన పోలీసువాడు బేరం తగిలిందని భావించి శవం దగ్గర నిలిచిఉన్న వ్యక్తి దగ్గరకు వచ్చాడు. ఆవ్యక్తిని చూసి.

ఏమయ్యా! ఈ శవాన్ని గుర్తుపట్టగలవా? ఏవూరూ? పేరేంటి? ఎక్కడ? ఏపని చేస్తున్నావు? అని ఇంటర్వ్యూలో నిరుద్యోగిని అడిగినట్లు అడిగాడు. అవ్యక్తి శవం తాలూకూ ఆచూకీ చెప్పాలను కొన్నాడు. అంతలోనే అతనికి ఆలోచన వచ్చింది "ఒకవేళ తను శవం తాలూకూ ఆచూకీ చెప్తే తాను కూడా పోలీసు స్టేషన్‌కి పోవలసి ఉంటుంది. అంతేగాక అక్కడ శవ పరీక్ష తరువాత శవ దహనానికి అయ్యే ఖర్చులు, వగైరా, ఆపైన పోలీసు వాళ్ళకూడా ముడుపులు చెల్లించవలసి ఉంటుంది. ఒకవేళ పోలీసు వాళ్ళకు కేసులు లేకపోతే లేదా తానిచ్చిన ముడుపు చాలకపోతే తనమీద కేసు బనాయించవచ్చు. ఎందుకొచ్చిన తద్దినం ఎలాగు చచ్చినవాడు చచ్చాడు. వాడు ఫలానా వాడని చెప్తే వాడికి ఒరగ బోయేదిలేదు. పైగా వాడి బంధువుకి అప్రతిష్ట." అని అనుకున్నాడావ్యక్తి. అందుచేత అతడు ఒక అపరిచితునిలాగా నటిస్తూ –

"ఆశవం ఎవరిదో నాకు తెలియదు, పైగా నాదీ పైవూరు. దైవ దర్శనానికి

—షేక్ నజీర్.

"వచ్చాను." అని చెప్పాడా వ్యక్తి. "ఛీ! బేరం చేతికొచ్చినట్లు వచ్చి జారిపోయింది" అనుకుంటూ తలగోక్కుంటూ పోలీసు తిరిగి తన స్టేజీ మీదకు వెళ్ళిపోయాడు.

ఒక పక్కన భక్తులు చాలాదూరం నుండి చాలా ఖర్చుపెట్టుకొని ఆ ఏడుకొండల వాడికి ముడుపు చెల్లించడానికి వెళ్తుంటే, అదే ముడుపును శవాన్ని అడ్డం పెట్టుకొని భక్తుల నుండి లాగాలని పోలీసు ఇంటి కుక్కలా కాచుకొని ఉన్నాడు. పాపం! ఆశవం బతికున్నంతకాలం తన వాళ్ళకి, దేశానికి బరువేగాక, చచ్చాక కూడ దేశానికి బరువైంది. ఒక్క మాటలో చెప్పాలంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందేగాని, దేశం ఏమాత్రం ప్రగతి సాధించింది? దేశ జనాభా శవప్రాయంగా ఉంది. జాతిలో నవచైతన్యం పుట్టనంత వరకు దేశానికి, శవానికి తేడా ఏం ఉంది?

---

# "భూమిని నడిపేవాడు"

కృధిత సంద్రాల్ని తోలుకుని
భూమండలాన్ని చీల్చిన కూలీలు
టోపిలెత్తి బిచ్చ మడుగుతున్నారు
టోపిలేకాదు
గడ్డపారలూ ఎత్తగలరు,
సముద్రాన్ని వెంట తెచ్చిన వాడు
నిన్ను బిచ్చ మడుగుతున్నాడు
సముద్రాలే కాదు
సర్వశక్తులూ
వాడి వెంటనడుస్తాయిప్పుడు
ఓటమిని బుజానేసుకుని
హస్తాద్రి వైపు పోతున్నాడు
శస్త్రాల్ని బుజానెత్తి
తూర్పున మొలుస్తాడు
భూమిని నడిపేవాడు.

—శ్రీధర్